క్లుప్తంగా

జిల్లాలో నల్లబర్లీ, తెల్లబర్లీ నిషేధం

అద్దంకి: అనమతి లేకుండా పొగాకు సాగు చేయవద్దని మండల వ్యవసాయధికారి కొర్ర పాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలో కొన్ని కంపెనీలకు చెందిన వారు కొందర పొగాకు సాగు చేయమని బాండ్లు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. బాపట్ల జిల్లాలో నల్లబర్లీ, తెల్ల బర్లీ నిషేధం విధించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎవరూ పొగాకు మడులు పెట్టకూడదని చెప్పారు. కలెక్టర్ ఉత్తర్వులు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కంపెనీలు గతేడాది సాగు చేయించిన పోగాకు నిల్వలు కొనుగోలు చేయకుండా మళ్లీ సాగు చేయమని ప్రోత్సహించడం క్షమించరాని నేరమని చెప్పారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు పాటించాలని కోరారు.

నేడు సామూహిక రాజ్యలక్ష్మి వ్రతాలు

చినగంజాం: స్థానిక భావన్నారాయణ స్వామి దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని సామూహిక రాజ్యలక్ష్మి అమ్మవారి వ్రతాలు ఆగస్టు 15వ తేదీ శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు రిటైర్డ్ తెలుగు పండితుడు, ఆలయ సేవాదళ సభ్యుడు కార్యక్రమ నిర్వాహకుడు జీ పిచ్చయ్య తెలిపారు. పవిత్ర శ్రావణ మాసం లక్ష్మీదేవికి ఇష్టమైన మాసంలో అమ్మవారికి పూజలు చేసుకోవడం విశేషం అని తెలిపారు. గడచిన 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సామూహిక వ్రతాలు కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారి సాయిశ్రీ చరణ్

చినగంజాం: సీజనల్ వ్యాధులు పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పీ సాయిశ్రీ చరణ్ అన్నారు. గురువారం చినగంజాంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించి బాలికలకు సీజనల్ వ్యాధులు బాలికల శారీరక సమస్యలు గురించి అవగాహన కలుగజేశారు. సీజన్‌లో వర్షాల కారణంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా ముందుస్తుగా జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, హెల్త్ విజిటర్ ఉల్దారాణి, హెల్త్ అసిస్టెంట్ మురళి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, హాస్టల్ వార్డెన్ పద్మావతి, 104 డీఈఓ పాదిలి రాఘవ, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

కారు - ద్విచక్ర వాహనం ఢీ

నాగులుప్పలపాడు: కారు - ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం మండలంలోని చదలవాడలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడుకు చెందిన పాలేటి ఆంజనేయులు, కొడివెండ్ల నారాయణ స్వామి ద్విచక్రవాహనంపై ఒంగోలు నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. 216వ నంబర్ జాతీయ రహదారిపై చదలవాడ వద్ద ఒక్కసారిగా రాంగ్ రూట్‌లోకి వెళ్లి నాగులుప్పలపాడు నుంచి ఒంగోలు వెళ్తున్న కారును ఢీకొట్టారు. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడి గాయాలవడంతో 108 వాహనంలో ఒంగోలులోని ఆస్పత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో గాయపడిన యువకులు

అకాల వర్షం.. అపార నష్టం!

- అకాల వర్షానికి చీరాల రైతు విలవిల
- మండలంలో తీవ్రంగా నష్టపోయిన వేరుశనగ, మినుము రైతులు
- సాగులో ఉన్న 73 హెక్టార్ల వేరుశనగ, 42 హెక్టార్ల మినుము
- పంట పొలాలను పరిశీలించిన వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు రమణారెడ్డి

చీరాల రూరల్:

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి చీరాల మండలంలో సాగుచేసిన వేరుశనగ, మినుము రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో పది నుంచి పదిహేను రోజుల్లో వేరుశనగ పంట ఇంటికి వస్తుందని.. పొలాలకు పెట్టుబడిపోను మిగిలిన ఎంతోకొంత ప్రతిఫలం దక్కుతుందని ఆశగా ఎదురుచూసిన రైతుల ఆనందం రెండు రోజుల్లో ఆవిరైపోయింది. అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. వేరుశనగ కాయలు కోసే దశలో భూమిలో నీరునిలిస్తే కాయలు బూజు పట్టి కుళ్లిపోతాయని, కాయలు మగ్గిపోయి వేర్లు వస్తాయని.. ఎందుకూ పనికిరాకుండా పూర్తిస్థాయిలో నష్టం వస్తుందని చెప్తున్నారు. అయితే కొందరు రైతులు మాత్రం నీటిలో ఉన్న పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే ఆశతో కూలీలకు అధిక ధరలు చెల్లించి పంటను పీకిస్తున్నారు. అలానే మినుము పండించే రైతులు కూడా తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఏకరువు పెడుతున్నారు.

పెట్టుబడులు కూడా రాని దుస్థితి..

చీరాల మండలంలోని రైతులందరూ చిన్న,సన్నకార రైతులే. ఒకవైపు ఉన్న అరకొర పొలాల్లో పంటలు వేసుకుంటూ మరోవైపు వ్యవసాయ కూలీలుగా ఇతర పొలాల్లో పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటుంటారు. ఈ క్రమంలో మండలంలోని తోటవారిపాలెం, బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, గనివివారిపాలెం గ్రామాలకు సంబంధించిన రైతులు 73 హెక్టార్లలో వేరుశనగ పంటను సాగుచేస్తున్నారు. ఒక్క తోటవారిపాలెంలో మాత్రం 42 హెక్టార్లలో రైతులు మినుము సాగుచేస్తున్నారు. వేరుశనగ పంట పూర్తిస్థాయిలో కాయలు కోసే దశలో ఉంది. మినుము పంట కూడా అదేవిధంగా ఉంది. కాయలు కోసే దశలో ఉన్న పంటలకు ప్రస్తుతం నీరు నిలిపివేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. సొంతపొలం అయితే వేరుశనగ పంటకు సొంతపొలం ఉన్న రైతులకైతే ఎకరాకు



నీటమునిగిన వేరుశనగ పంటను పీకుతున్న మహిళా కూలీలు

పెట్టుబడిగా రూ. 50 ఉండగా కౌలు రైతులకైతే ఎకరాకు రూ. 70 వేలు పెట్టుబడి ఖర్చవుతుంది. అలానే మినుము పంటకు ఎకరాకు రూ. 35 వేలు వరకు పెట్టుబడి అవసరమవుతుందని రైతులు చెప్తున్నారు. నీటమునిగిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారిణి నిర్మల తన సిబ్బందితో గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. వర్షాలు ఇలానే కొనసాగితే పూర్తిగా రైతులు నష్టపోతారని, ఎండలు కాస్తే నీరంతా భూమిలో ఇంకిపోయి కొంతమేరా మాత్రమే నష్టం వస్తుందని వ్యవసాయాధికారణి చెప్తున్నారు. పంటనష్టపోయిన రైతులను, పంటలను వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు రమణారెడ్డి పరిశీలించి ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



నీట మునిగిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు రమణారెడ్డి



నీటిలో ఉన్న పంటను పరిశీలిస్తున్న ఏవో నిర్మల

తీవ్రంగా నష్టపోయాం..

నా సొంత పొలంలో ఐదు ఎకరాలు వేరుశనగ పంట సాగుచేశాను. అప్పులు తెచ్చి మరీ సాగుచేశాను. మా శ్రమకు తగ్గట్టుగానే పంట బాగా పండింది. పెట్టుబడిపోను ఈ ఏడాది మంచి లాభాలు వస్తాయనుకుంటున్న సమయంలో అకాల వర్షం పంటను ముంచెత్తింది. పెట్టుబడిగా ఇప్పటి వరకు రూ.3 లక్షల వరకు ఖర్చయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కొల్లూరు రమేష్, రైతు, పిట్టువారిపాలెం

కోలుకోలేని దెబ్బతీసింది..

10 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని వేరుశనగ వేశా. పంట మరో 15 రోజుల్లో ఇంటికి వస్తుందని ఎంతో ఆనందంగా ఉన్నా. ఇప్పటి వరకు సుమారు రూ.7 లక్షల వరకు పెట్టుబడిపెట్టా. అకాల వర్షానికి పొలంలో నీరు నిలిచిపోయింది. కాయ కోసే దశలో నీరు నిలిస్తే కాయలు పనికి రావు, వాటిని ఎవరూ కొనరు.

– పిట్టు శ్రీను, రైతు పిట్టువారిపాలెం

ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి..

కోత దశలో ఉన్న వేరుశనగ పంట పూర్తిగా నీట మునిగింది. దీనివలన రైతులు నష్టపోతారు. వ్యవసాయాధికారులు నిశితంగా పంట పొలాలను పరిశీలించి పారదర్శకంగా రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాలి. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం.

– కావూరి రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకుడు

ఇంకొల్లుకు పల్లె వెలుగులు లేవా?

ఇంకొల్లు(చినగంజాం): పల్లెవెలుగు బస్సులు కొరత ఉండటంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొల్లు బస్టాండ్ చీరాల బస్సుడిపో పరిధిలో ఉన్నప్పటికీ పల్లెవెలుగు బస్సులు ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. ఇంకొల్లు నుంచి వయా తిమ్మసముద్రం గ్రామం, స్వర్ణ గ్రామం మీదుగా రెండు బస్సులు చొప్పున ఆర్టీసీ అధికారులు నడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కేవలం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ రకాల బస్సుల్లో అని చెప్తున్నా.. ప్రస్తుత తరుణంలో ఇంకొల్లు బస్సు స్టాండు పరిధిలో పల్లెవెలుగు బస్సులు లేకుండా సాధ్యపడుతుందా అనే అనుమానం ప్రయాణికుల నుంచి వ్యక్తం అవుతోంది. గతంలో ఇంకొల్లుకు చీరాల, అద్దంకి, ఒంగోలు, గుంటూరు, చిలకలూరిపేట డిపోల నుంచి సుమారు 50 బస్సుల వరకు నిత్యం అధికారులు నడిపేవారు.



బస్సులు లేక వెలవెలబోతున్న ఇంకొల్లు బస్టాండు

బస్టాండ్‌పై ఎందుకంత కక్ష..

ఏడాది నుంచి మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలోని గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు కాలం చెల్లిన పలు బస్సులను పక్కన పెట్టడంతో సర్వీసులు నిర్వహించేందుకు ఇబ్బంది ఏర్పడింది. దాంతో ఇంకొల్లు లాంటి బస్టాండులకు ఇబ్బందులు మొదలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళ ఉండే నైట్ హాల్ట్ బస్సులను సైతం అధికారులు ఇంకొల్లు బస్టాండు నుంచి తొలగించడంతో ప్రయాణికులకు సమస్యలు మరింత పెరిగాయి. ఇంకొల్లు నుంచి గతంలో హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు వెళ్లేందుకు కూడా అవకాశాలు ఉండేవి.

ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు ఇంకొల్లు బస్టాండు విషయంలో కినుక వహించడంతో స్థానికంగా మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. దాంతో పాటు పల్లె వెలుగు బస్సులు తక్కువగా ఉండటంతో ప్రయాణికుల అవస్థలు వర్ణించ అలవికాకుండా ఉంది. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సందర్భంగా అదనంగా పల్లెవెలుగు బస్సులు ఏర్పాటు చేస్తుందా లేదా అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

చీరాల అర్బన్: ఉన్నత చదువుల నిమిత్తం పేద విద్యార్థి పల్లా యోగానంద్‌కు దాతలు ఆర్థిక సాయం అందించారు. గురువారం సాయంత్రం స్థానిక గౌతమి జూనియర్ కాలేజీలో చదివిన విద్యార్థి పల్లా యోగానంద్‌కు ఉన్నత చదువుల నిమిత్తం అవసరమైన సాయాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో అందించారు. న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, అడ్డగడ మల్లికార్జున, మద్దుల నాగేశ్వరరావు, ఆలపాటి వినయ చౌదరిలు రూ.40 వేలను విద్యార్థికి అందించారు. బండారుపల్లి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి ముందుకు వచ్చి దాతల సహకారంతో ఇటువంటి కార్యక్రమాలను చేయడం అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షుడు బాచిన నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మువ్వల వంశీకృష్ణ, సభ్యులు డాక్టర్ ఆలపాటి విజయ్‌కుమార్, అడ్డగడ మల్లికార్జున, ఆర్‌వీ రమణ, తాడివలస దేవరాజు, మన్నెం వెంకటేశ్వరరావు, పుల్లెల సుబ్రహ్మణ్యం, గౌతమి సంస్థల అధినేత ముట్టే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దాతలు

వైభవంగా విమాన కలశ పునఃప్రతిష్ఠ

అద్దంకి: ప్రముఖ పుణ్య క్షేత్రమైన శింగరకొండపై ఉన్న లక్ష్మి నరసింహస్వామి దేవస్థాన విమాన గోపుర కలశ పునఃప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగా గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. హాజరైన భక్తులకు అన్నదానంతో పాటు, ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. చివరి రోజులో భాగంగా కార్యక్రమంలో దాతలతోపాటు, ఆలయ కమిటీ చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఈవో, భక్తులు తదితరులు, పాల్గొన్నారు.



విమానకలశాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

79 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చీరాల: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం చీరాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని, దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ర్యాలీలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎం.మహేంద్రనాథ్, వైస్ చైర్మన్ పాతూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బోడవాడ గ్రామంలో నేత్రదానం

ఇంకొల్లు(చినగంజాం): బోడవాడ గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి వీరారెడ్డి (98) మృతి చెందడంతో ఆయన నేత్రాలను స్వచ్ఛందంగా దానం చేసేందుకు ఆయన కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. మృతుని కుమారుడు అంజిరెడ్డి, కోడలు రమాదేవి, కుమార్తె గాదె అంజమ్మ, అల్లుడు వెంకటేశ్వరరెడ్డిలు ఆమోదం మేరకు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఏ శివాని, హెచ్ శివలు దాత కార్నియాలను సేకరించారు. దాత కుటుంబ సభ్యులను ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డిలు అభినందించారు.

శుద్ధమైన తాగునీటిని మాత్రమే తాగాలి

కారంచేడు: వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామస్తులకు శుద్ధమైన తాగునీటిని అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ కే నేతాజీ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు గ్రామంలో తాగునీటి ట్యాంక్‌ల ద్వార శుద్ధ జలాలు ఎలా సరఫరా అవుతున్నాయో ఆయన పరిశీలించారు. గ్రామస్తులకు తాగునీటితో పాటు, ఇంటి అవసరాల కోసం సరఫరా చేసే జయప్రకాష్ నారాయణ చెరువుతో పాటు, లైబ్రరీ సెంటర్‌లోని రెండు చెరువులు, మాదిగ కుంటల్లోని నీటిని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు నీటిలో జీవ కలుషిత శాతాన్ని పరిశీలించారు. నీటిలో క్లోరిన్ శాతం, జీవ వ్యర్థాల శాతాన్ని సైతం వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు జయరాజు, ఆలియా, ఎంఎల్‌హెచ్‌పీలు జయశ్రీ, శాంతిప్రియలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కారంచేడులో తాగునీటిని పరీక్షిస్తున్న ఇంజనీరింగ్, వైద్య సిబ్బంది

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవాలు



ప్రతిష్ఠించిన పోలేరమ్మ తల్లి



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

బల్లికురవ: మండలంలోని కొత్తూరు గ్రామంలో గురువారం వేద మంత్రోచ్చారణల మధ్య వెంకటేశ్వరస్వామి మందిరంలో శంఖు, చక్రం, నామాలు, పోలేరమ్మ, అంకమ్మతల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రతిష్టాచార్యులు బ్రహ్మశ్రీ కృష్ణ వర్మ బృందంచే ఉదయం యాగశాలలో నిత్య పూజ హోమం, తదుపరి యంత్ర విగ్రహ శిఖర ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, అమ్మవార్ల విశ్వరూప దర్శనం అనంతరం సుమారు 5 వేల మందికి అన్న సంతర్పణ చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

జ్వరాల సర్వే ప్రతి రోజూ చేయాలి



యద్దనపూడిలో నీటి నిల్వలను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ



ఉప్పుటూరులో జ్వరాలపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది

యద్దనపూడి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో జ్వరాల సర్వే ప్రతిరోజు చేయాలని.. ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ షేక్ మహ్మద్ అఖీబ్ జావెద్ అన్నారు. గురువారం మండలంలోని యద్దనపూడి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి జ్వర సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీహర్ష, ఏఎన్‌ఎంలు, ఆశాలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): ఇంటింటికి ఆరోగ్య శాఖ పరిధిలో జరుగుతున్న ఫీవర్ సర్వేకు ప్రజలు సహకరించాలని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించడంతో పాటు డెంగీ సర్వే నిర్వహించారు. జాగ్రత్తలు పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రజలు తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నీలం వెంకటరామకృష్ణ, సీహెచ్‌ఓ శృతి, ఆశావర్కర్‌లు రత్న కుమారి పాల్గొన్నారు.